

అన్నదాత కన్నీరు..!

ఆరుగాలం శ్రమించి పండించిన పంట వర్షం పాలు

- చేతికొచ్చిన పంట నోటికందకుండా పోతోందని రైతుల ఆవేదన
- ప్రభుత్వం ఆదుకోవాలని వినతి



ప్రభుత్వం ఆదుకోవాలి

ఆర ఎకరం భూమిలో సుమారు 20 వేలు పెట్టుబడి పెట్టి వేసిన వరి పంట కోసిన తరువాత తడిచిపోయింది. మరో రెండు రోజులు తడిస్తే పూర్తిగా పాడైపోతుంది. పెట్టుబడి పోయింది. చేతికందొచ్చిన పంట పోయింది. ప్రభుత్వం ఆదుకోవాలి. – కాసెపు అప్పన్న, రైతు, సర్వసిద్ధి



కోతలు వాయిదా వేసుకోవాలి

మండలంలో 3 వేల హెక్టార్లలో వెయ్యి హెక్టార్ల వరకు కోతలు పూర్తయ్యాయి. కొంత కుప్పలుగా, మరి కొంత పనలుగా ఉంది. మిగిలినవారు కోతలు వాయిదా వేసుకోవాలని చెప్పాం. తడిచిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది. రైతును ఆదుకునే విధంగా ప్రభుత్వానికి నివేదిక అందిస్తాం.

–సౌజన్య, మండల వ్యవసాయాధికారి, ఎస్.రాయవరం



కోతలు చేసి హడావుడిగా వరి కుప్పలు వేస్తున్న రైతులు



కోతలు చేసి పనలు రూపంలో పొలంలో ఉన్న వరి పంట

ఎస్.రాయవరం: తరచూ భారీ వర్షాలు, వరదలు అన్నదాత వెన్ను విరుస్తున్నాయి. అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టిన రైతులను నిండా ముంచేస్తున్నాయి. ఆరుగాలం శ్రమను ఆవిరి చేస్తున్నాయి. అన్నదాతకు కన్నీరు మిగులుస్తున్నాయి. రెండు రోజులుగా కురుస్తున్న చిరుజల్లులతో రైతులకు కంటి మీద కునుకులేకుండా చేస్తున్నాయి. కోసిన వరి పనలు పొలాల్లోనే తడవడంతో ఆందోళన చెందుతున్నారు. మండలంలో ఈ ఏడాది అత్యధికంగా సుమారు 8 వేల ఎకరాల్లో వరిపంట వేశారు. గడిచిన పది రోజులుగా సుమారు 30 శాతం వరకు వరి కోతలు పూర్తయ్యాయి. అందులో 10 శాతం వరి పనలు పొలాల్లోనే ఉన్నాయి. మిగతా శాతం వరి కుప్పలుగా వేసుకుని భద్రపరచుకున్నారు. మరో 40 శాతం మేర వరి కోతలు చేయాల్సి ఉంది. ఈ సమయంలో అల్పపీడనం తరుముకొచ్చింది. పండిన చేను కోత చేసుకుని భద్రపరచుకోవాలా? తుపానుతో మరి కొద్ది రోజులు ఆగాలా? అన్న సందిగ్ధంలో రైతులు పడిపోయారు. కోతలు చేసి పనలు ఇప్పటి వరకు తడిచిన మేర కొంత నష్టం వస్తుందని, మరో రెండు రోజుల పాటు వర్షం కురిస్తే పంట పూర్తి నాశనం అవుతాదని ఆందోళన చెందుతున్నారు. మరో 10 రోజుల్లో కోతలు పూర్తయి, భద్రపరుచుకునే సమయంలో అల్పపీడనం ముంచుకొచ్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేతికందొచ్చిన పంట కళ్ల ముందు వర్షానికి పాడైపోతుంటే ఏం చేయలేని నిస్సహాయ స్థితిలో రైతులు ఉన్నారు. వర్ష ప్రభావంతో నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం చెల్లించి ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.



సగం మేర కోతలు చేసిన వరి పంట

క్లుప్తంగా

జగనన్న జన్మదిన వేడుకలకు సర్వం సిద్ధం



కిల్లాడ శ్రీనివాసరావు

కోటవురట్ల: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 21న జగనన్న జన్మదిన వేడుకలను మండల స్థాయిలో కోటవురట్ల ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ఉన్న దివంగత సీఎం వైఎస్సార్ విగ్రహం వద్ద నిర్వహించనున్నట్టు తెలిపారు. ఉదయం 8.30 గంటలకు కార్యక్రమం జరుగుతుందని పెద్ద సంఖ్యలో నాయకులు హాజరు కావాలని కోరారు. అనంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు.

దిమిలి పీహెచ్‌సీలో కొత్త భవనాల ప్రారంభం



దిమిలి పీహెచ్‌సీలో భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్

రాంబిల్లి(యలమంచిలి): రాంబిల్లి మండలంలోని దిమిలి పీహెచ్‌సీలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో టొయోస్తు రేర్ ఎర్త్స్ కంపెనీ సీఎస్ఆర్ నిధులతో నిర్మించిన అదనపు గదుల భవనాన్ని ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ గురువారం ప్రారంభించారు. ఎస్ఈజెడ్‌లోని ఫార్మా పరిశ్రమల కార్మికుల వైద్యం కోసం ఈ భవనాలను వినియోగించాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యాధికారి వెంకటేష్, టొయోస్తు రేర్ ఎర్త్స్ యాజమాన్య ప్రతినిధులు, స్థానిక నాయకులు, ఆస్పత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ఎస్.రాయవరం: మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఇన్‌చార్జి ఎంపీడీవో జి.సత్యనారాయణ తెలిపారు. ఎంపీపీ కోన లోవలక్ష్మి అధ్యక్షతన ఉదయం 11 గంటలకు ప్రారంభం కానున్న ఈ సమావేశానికి మండల అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

మునగపాక గ్రామాభివృద్ధికి సహకరించాలి



మునగపాకలో డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ అప్పారావు

మునగపాక: మునగపాక గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ రాజకీయాలకు అతీతంగా సహకరించాలని సర్పంచ్ దిమ్మల అప్పారావు కోరారు. మునగపాక మెయిన్‌రోడ్డులోని లింగరాయి గుడి ఆవరణలో తలపెట్టిన డ్రైనేజీ నిర్మాణ పనులను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మునగపాక గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు పాలకవర్గం కృషి చేస్తుందన్నారు. వీధి దీపాల నిర్వహణ, తాగునీరు, పారిశుద్ధ్యం మెరుగుకు పాటుపడుతున్నామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మానస, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలకు ఉచితంగా మినరల్ వాటర్



వాటర్ ప్లాంట్ సిబ్బందితో మాట్లాడుతున్న విమలనాయుడు

అచ్యుతాపురం: అచ్యుతాపురంలోని ప్రభుత్వ కార్యాలయాలకు ఉచితంగా మంచినీటిని అందిస్తామని సర్పంచ్ భర్త విమలనాయుడు తెలిపారు. ఇటీవల ఇక్కడి మినరల్ వాటర్ ప్లాంట్ వద్ద మంచినీటిని అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు అక్కడ పనిచేసే వ్యక్తిని మందలించామని చెప్పారు. ఏషియన్ పెయింట్స్ సహకారంతో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశామని, ఈ క్రమంలో ప్రభుత్వ కార్యాలయాలకు ఉచితంగానూ, ప్రైవేట్ వ్యక్తులకు నిర్దేశించిన ధరకు విక్రయిస్తామని స్పష్టం చేశారు.

పల్లకిలో వెంకన్న తిరువీధి సేవ



పల్లకిలో స్వామివారికి తిరువీధి సేవ నిర్వహిస్తున్న అర్చకులు

నక్కపల్లి: ధనుర్మాస అధ్యయనోత్సవాల్లో భాగంగా గురువారం ఉపమాక వేంకటేశ్వర స్వామివారికి పల్లకిలో తిరువీధి సేవ నిర్వహించారు. ఉదయం కొండపై మూలవిరాట్‌కు, కొండ దిగువన ఉత్సవ మూర్తులు, క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామి, గోదాదేవి అమ్మవారికి నిత్య పూజలు, అర్చనలు చేశారు. అనంతరం పెద్దపల్లకిలో ఉభయ నాంచారులతో కూడిన స్వామివారిని, చిన్నపల్లకిలో గోదాదేవి అమ్మవారిని ఉంచి మాఢవీధుల్లో తిరువీధి నిర్వహించారు. అనంతరం గోదాదేవి అమ్మవారి సన్నిధిలో తిరుప్పావై పాశురం విన్నపం చేసిన నీరాజన మంత్రపుష్పాలు, ప్రసాద నివేదన, తీర్థగోష్ఠి, ప్రసాద వినియోగం కార్యక్రమాలు జరిపారు. ఈ తిరువీధి సేవల్లో ప్రధానార్చకుడు గొట్టుముక్కల వరప్రసాద్, అర్చక స్వాములు కృష్ణమాచార్యులు, శేషాచార్యులు, సాయి ఆచార్యులు, రాజగోపాలాచార్యులు పాల్గొన్నారు.

రహదారి భద్రతపై అవగాహన ర్యాలీ

కోటవురట్ల: రహదారి భద్రతను పాటించండి.. సురక్షితంగా ఇంటికి వెళ్లండంటూ వెలుగు సిబ్బంది నినదించారు. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో వెలుగు సిబ్బంది గురువారం రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక స్త్రీ శక్తి భవనం నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు ర్యాలీ చేశారు. ప్రధాన కూడలిలో మానవహారంగా ఏర్పడి రహదారి భద్రతను పాటించాలని నినాదాలు చేశారు. బైక్‌పై వెళ్లేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారులో సీట్ బెల్ట్ పెట్టుకోవాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని, అతివేగం ప్రమాదాలకు హేతువని సూచించారు.

రెవెన్యూ సదస్సులతో రైతులకు మేలు



చౌడువాడ రెవెన్యూ సదస్సులో తహసీల్దారు తిరుమలబాబుకు వినతి పత్రం అందిస్తున్న రైతు



కుమారపురం సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ ఆదిమహేశ్వరావు

కోటవురట్ల: రైతుల భూసమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని తహసీల్దారు తిరుమలబాబు తెలిపారు. చౌడువాడలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతుల నుంచి అర్జీలు స్వీకరించి భూసమస్యలపై అవగాహన కల్పించారు. తహసీల్దారు మాట్లాడుతూ రీ సర్వే, పట్టాల క్రమబద్ధీకరణ, ఇంటి పన్నుల మార్పిడి వంటి సమస్యలపై ఎక్కువగా దరఖాస్తులు వస్తున్నట్టు తెలిపారు. భూ సమస్యలను పారదర్శకంగా పరిష్కరిస్తున్నామన్నారు. ఈ సదస్సులో వివిధ సమస్యలపై 6 దరఖాస్తులు వచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గోపాలకృష్ణ, రైతులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

యలమంచిలి రూరల్: సామన్య ప్రజలు, రైతుల భూముల సమస్యల పరిష్కారానికే రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ అన్నారు. గురువారం మున్సిపాలిటీ పరిధి తెరువుపల్లిలో రెవెన్యూ సదస్సుకు హాజరైన ఆయన మాట్లాడుతూ సదస్సులను అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎంతో కాలంగా పరిష్కారం కాని భూముల సమస్యలను సదస్సుల్లో అధికారుల దృష్టికి తీసుకొచ్చి తగు పరిష్కారం పొందాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వరహాలు, డిప్యూటీ తహసీల్దార్ వినయ్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

మునగపాక: రైతుల సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు దోహదపడతాయని తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు తెలిపారు. మండలంలోని కుమారపురం రామాలయం ఆవరణలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సదస్సులో రీ-సర్వే డీటీ పడాల్, మాజీ ఎంపీటీసీ పల్లెల ప్రకాశరావు, తదితరులు పాల్గొన్నారు.

సోలార్ విద్యుత్ వినియోగంపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయకుమార్

మునగపాక: సోలార్ విద్యుత్ వాడకంపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ కోరారు. మండలంలోని తోటాడ త్రిమూర్తుల ఆలయ సమీపంలో గురువారం సాయంత్రం ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజనా పథకంలో భాగంగా సోలార్ వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహ వినియోగదారులకు సోలార్ విద్యుత్ ఎంతో ఉపయోగకరం ఉంటుందన్నారు. జిల్లాలో మూడు గ్రామాలను పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేశారని, అందులో మునగపాక మండలంలో తోటాడను ఎంపిక చేశామన్నారు. సర్పంచ్ దొడ్డి మంగవేణి, విద్యుత్ శాఖ ఎస్ఈ ప్రసాదరావు, ఈఈ రామకృష్ణ, ఎంపీడీవో ఎం.ఉషారాణి, తహసీల్దార్ ఆది మహేశ్వరరావు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

బహిరంగ మలవిసర్జన అనాగరికం



మాట్లాడుతున్న ఒంపోలు పంచాయతీ కార్యదర్శి హరనాథ్

మునగపాక: గ్రామాల్లో బహిరంగ మల విసర్జనకు దూరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఒంపోలు పంచాయతీ కార్యదర్శి హరనాథ్ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పంచాయతీ సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులకు ఆరోగ్యకరమైన గ్రామం సాధనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయం చేసుకుంటూ గ్రామానికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేయాలన్నారు. గ్రామసభలు గ్రామాభివృద్ధికి ఎంతో కీలకమన్నారు. అర్హులైన లబ్ధిదారులను గుర్తించేందుకు గ్రామసభలు దోహదపడతాయన్నారు. సమాచార హక్కు చట్టంపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, మండల పరిషత్ సూపరింటెండెంట్ ప్రసాద్, తదితరులు ఈ శిక్షణలో పాల్గొన్నారు.

'అధికారులే సమ్మెట్ ప్రశ్నపత్రాలు తేవాలి'

అనకాపల్లి: వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న సమ్మెట్ పరీక్షల పేపర్లు ఉదయం, సాయంత్రం సమయంలో హెచ్‌ఎంలు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి గంట ముందు తీసుకు రావాలనే ఆదేశాలను ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయ్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కొన్ని ప్రభుత్వ పాఠశాలలు పోలీస్ స్టేషన్‌కు 15 నుంచి 20 కిలోమీటర్లు దూరంలో ఉండడంతో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. విద్యాశాఖ అధికారులు నేరుగా విద్యార్థులు పరీక్షలు రాసే పాఠశాలలకు సమ్మెట్ పరీక్ష పేపర్లను తీసుకువచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

కాలీఫ్లవర్ అమ్మకాల జోరు



కశింకోట: స్థానిక వారపు సంతలో గురువారం కాలీఫ్లవర్ అమ్మకాలు జోరుగా సాగాయి. వీటిని తక్కువ ధరకు విక్రయించడంతో ప్రజలు ఎగబడి కొనుగోలు చేశారు. పెద్ద వ్యాన్‌లో ఎక్కువగా కాలీఫ్లవర్‌లను సంతకు విశాఖ నుంచి తీసుకువచ్చి ఉదయం నుంచి అమ్మకానికి పెట్టారు. వాటిని సైజు అనుసరించి రూ.పది నుంచి రూ.20 చొప్పున విక్రయించారు. వీటి ధర సంతలోని చిల్లర దుకాణాల్లో కంటే తక్కువగా ఉండటం, పెద్దవి కావడంతో వ్యాన్ వద్ద 'భలే మంచి చౌక బేరం' అంటూ యువత, పెద్దలు అన్న తేడా లేకుండా ఎగబడి కొనుగోలు చేశారు. ఇక సంతలో కొన్ని కూరగాయల ధరలు కాస్త తగ్గుముఖం పట్టాయి. టమాటా ధర దిగివచ్చింది. కిలో రూ.30కి అమ్మకాలు సాగాయి. బంగాళదుంప, ఉల్లి, బెండకాయలు, వంకాయ రూ.40, చామదుంప రూ.60, బీట్రూట్, క్యారెట్, బీన్స్, గోరు చిక్కుడు, పాదు చిక్కుడు, క్యాప్సికం రూ.80 చొప్పున విక్రయాలు సాగాయి.

బాలలతో పని చేయించడం నేరం



పులపర్తి వద్ద హోటల్‌లో తనిఖీలు చేస్తున్న అధికారులు

యలమంచిలి రూరల్: బాలలతో పని చేయించడం చట్ట ప్రకారం నేరమని, బాలలు ఉండాల్సింది బడిలోనని పనిలో కాదని యలమంచిలి సహాయ కార్మికశాఖాధికారి వెంకటేశ్వరరావు సూచించారు. ఎవరైనా బాలలతో పని చేయిస్తే చట్ట ప్రకారం క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు. గురువారం యలమంచిలి పట్టణం, మండలంలో వివిధ వ్యాపార సంస్థలు, వస్త్ర దుకాణాలు, హోటళ్లలో పోలీసులు, బాలల రక్షణ జిల్లా కమిటీ సభ్యులతో అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, న్యాయవాదులతో కలిసి తనిఖీలు నిర్వహించారు. వ్యాపారులకు బాలకార్మిక వ్యవస్థపై అవగాహన కల్పించారు. 14 ఏళ్ల లోపు పిల్లలతో పని చేయిస్తే తమకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు అధికారులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల హక్కుల పరిరక్షణ కమిటీ ప్రతినిధి డి.లోవరాజు, యలమంచిలి కోర్టు ప్యానల్ న్యాయవాది నూకరాజు, సీడ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి చిన్నారావు, పోలీసు, పంచాయతీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మీ నమో నమః



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

- కనకమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు
- 3వేల మందికి పైగా దర్శనభాగ్యం
- నేడు ఆలయ ఆవరణలో లక్ష కుంకుమ పూజ



అమ్మవారి దర్శనానికి క్యూలైన్లో వేచి ఉన్న భక్తులు

యలమంచిలి రూరల్: పట్టణంలోని ధర్మవరంలో కొలువైన సిరుల తల్లి కనకమహాలక్ష్మి అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా మూడో గురువారం అమ్మవారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. సుమారు 3 వేల మందికి పైగా భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. గురువారం వేకువజామునే అమ్మవారికి ఆలయ ప్రధాన అర్చకుడు వెలవలపల్లి కోటేశ్వర కుమార్ శర్మ ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం, విశేష పూజలు చేసిన తర్వాత భక్తులను దర్శనానికి అనుమతించారు. మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని పసుపు, కుంకుమ, చీర, జాకెట్టు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఉచిత, టికెట్ దర్శనాలు సజావుగా జరిగేలా ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఆలయ ప్రాంగణంలో ఉత్సవ విగ్రహం వద్ద మహిళలు ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ చైర్మన్ కొఠారు సాంబ, పిల్లా రాము, తాటిపాకల మాణిక్యాలరావు, రాము, తాటిపాకల చిన్ని, కొఠారు సూర్య ప్రకాశరావు, తదితరులు స్వయంగా క్యూలైన్లను నియంత్రించారు.

నేడు లక్ష కుంకుమ పూజ

మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా అమ్మవారికి మూడో శుక్రవారం మహిళలతో లక్ష కుంకుమ పూజ నిర్వహించడానికి భారీ ఏర్పాట్లు చేశారు. పూజలో పాల్గొనే మహిళలందరికీ స్థానిక వ్యాపారి సమయమంతుల బుచ్చియ్య దంపతులు పూజా సామగ్రిని సమకూర్చుతున్నారు. పూజలో పాల్గొనే భక్తులతో పాటు సాధారణ భక్తులకు కూడా అన్నప్రసాదం పెట్టేందుకు నిర్ణయించారు. లక్ష కుంకుమ పూజ నిర్వహణకు సంబంధించి పట్టణం, పరిసర గ్రామాల్లో ఆటోలు, రిక్షాలతో ప్రచారం చేశారు. పెద్ద సంఖ్యలో మహిళలు తరలిరానుండడంతో ఆలయ కమిటీ పటిష్ఠ ఏర్పాట్లు చేస్తోంది.



కర్రివానిపాలెంలో పూజలందుకున్న కనకమహాలక్ష్మి

ఎస్.రాయవరం: మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా కర్రివానిపాలెంలోని కనకమహాలక్ష్మి అమ్మవారికి మూడో గురువారం పూజలు ఘనంగా జరిగాయి. ఉత్సవ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

'అంబేడ్కర్‌పై అమిత్‌షా వ్యాఖ్యలు సరికాదు'



సమావేశంలో మాట్లాడుతున్న అంబేడ్కరిజమ్ పునాది అసోసియేషన్ కన్వీనర్ బుజ్జిబాబు

మునగపాక: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై బీజేపీ నేత అమిత్ షా అనుచిత వ్యాఖ్యలు చేయడం విచారకరమని అంబేడ్కరిజమ్ పునాది అసోసియేషన్ కన్వీనర్ రాజాన బుజ్జిబాబు అన్నారు. మునగపాకలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంతో మందికి రాజ్యాంగ పదవులు కల్పించిన మహానుభావుడు అంబేడ్కర్ అని కొనియాడారు. అంబేడ్కర్ జీవితం ఎంతో మందికి ఆదర్శంగా నిలుస్తుంటే.. అమిత్ షా తప్పుడు వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదన్నారు. అన్ని వర్గాల ప్రజలకు అంబేడ్కర్ రచించిన రచనల ద్వారా మేలు జరిగిందన్నారు. ఇప్పటికైనా అటువంటి వ్యాఖ్యలను అమిత్‌షా విరమించుకోవాలన్నారు. ఈ సమావేశంలో దళిత నాయకులు దిమ్మల అప్పారావు, లంబా అప్పారావు, గుంట్ల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారులకు జాప్యం లేకుండా సేవలు



మాట్లాడుతున్న ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామకృష్ణ

కశింకోట: ఏపీ ఈపీడీసీఎల్ కశింకోట డివిజన్ పరిధిలో జాప్యం లేకుండా విద్యుత్ వినియోగదారులకు సేవలందిస్తున్నామని డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామకృష్ణ తెలిపారు. గురువారం స్థానిక డివిజన్ ప్రధాన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏపీ రెగ్యులేటరీ కమిషన్ నిర్దేశించిన మేరకు నిర్ణీత వ్యవధిలోగా వినియోగదారులకు సేవలు కల్పిస్తున్నామన్నారు. వారం రోజుల్లోగా ఇళ్ల విద్యుత్ కనెక్షన్, నెల రోజుల్లోగా వ్యవసాయ కనెక్షన్ ఇవ్వనున్నామన్నారు. అయితే విద్యుత్ వాడకాన్ని అనుసరించి సెక్యూరిటీ డిపాజిట్, డెవలప్‌మెంట్ చార్జీలను, అప్లికేషన్ రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి అవసరమైన డాక్యుమెంట్లను ఇళ్ల కనెక్షన్ కోసం అందజేయాల్సి ఉంటుందన్నారు. అదే వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కోసం రూ.6 వేల డిపాజిట్ చెల్లించాలని, 180 మీటర్ల దూరం లోపు పొలం అందుబాటులో ఉండాలన్నారు. అంతకు మించిన దూరం ఉంటే విద్యుత్ లైన్‌కు అంచనా విలువ మేరకు అదనంగా చెల్లించిన తర్వాత కనెక్షన్ ఇస్తామన్నారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లను ప్రాధాన్యతా క్రమంలో ఇస్తున్నామన్నారు. ఇప్పటికీ ఈ ఏడాది 56 కనెక్షన్లు పొందడానికి డివిజన్ పరిధిలో దరఖాస్తు చేశారన్నారు. విద్యుత్ రీడింగ్ మీటర్లు లోడ్ అధికం కావడం వల్ల కాలిపోతే వాటిని ఏర్పాటు చేయడానికి అయ్యే ఖర్చును వినియోగదారుడు భరించాల్సి ఉంటుందన్నారు. అందువల్ల విద్యుత్ వాడకం లోడ్‌ను క్రమబద్ధీకరించుకుంటే, అందుకు సరిపడిన సామర్థ్యం కలిగిన రీడింగ్ మీటరును ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఒకవేళ మీటర్లు తిరగడం ఆగిపోతే వాటిని మాత్రం ఉచితంగా సమకూర్చి మారుస్తామన్నారు.

1912 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా ఫిర్యాదు:

ఎటువంటి విద్యుత్ సమస్యలనైనా టోల్ ఫ్రీ నెంబర్ 1912, తమ సంస్థకు సంబంధించిన మొబైల్ ఫోన్ల యాప్‌ల ద్వారా ఫిర్యాదు చేస్తే పరిశీలించి పరిష్కరిస్తామని ఈఈ రామకృష్ణ తెలిపారు. వాటికి ఎక్నాలెజ్‌మెంట్ ఇస్తామన్నారు. విద్యుత్ బిల్లులను తమ యాప్ ద్వారా చెల్లించుకోవచ్చునన్నారు. మూడేళ్ల క్రితం ఆర్ఈసీఎస్‌ను ఏపీఈపీడీసీఎల్‌లో విలీనం చేశారన్నారు. అప్పటి నుంచి విద్యుత్ ఆపరేషన్ నిర్వహిస్తూ సమర్థవంతంగా సేవలందిస్తున్నామన్నారు. ఈపీడీసీఎల్‌లో 30 డివిజన్లు ఉన్నాయన్నారు. వాటిలో తమ డివిజన్ కూడా బాగా సేవలందిస్తుందన్నారు. రానున్న కాలంలో అన్ని విభాగాల్లో సమర్థవంతంగా పని చేసేలా సేవలను విస్తృతపరుస్తున్నామన్నారు. ఇందుకు వినియోగదారులు సహకారం అందించాలన్నారు. ఏవో మధు సమావేశంలో పాల్గొన్నారు.

28 నుంచి ఏపీజీవీబీ సేవలు నిలుపుదల

అనకాపల్లి: భారత ప్రభుత్వ ఆర్థిక సేవల విభాగం(డీఎఫ్ఎస్) ఆదేశాల మేరకు వరంగల్ ప్రధాన కార్యాలయం కేంద్రంగా ఏపీజీవీబీ ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల్లో తమ కార్యకలాపాలను విభజించడం జరుగుతుందని బ్యాంకు రీజనల్ మేనేజర్ ఎస్.సతీష్‌చంద్ర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ నెల 28 నుంచి 31వ తేదీ వరకూ బ్యాంక్ సేవలు, ఏటీఎం కార్డులు, ఆన్‌లైన్ నగదు లావాదేవీలతో పాటు ఇతర బ్యాంకు కార్యకలాపాలు పూర్తిగా నిలుపుదల చేస్తున్నట్లు చెప్పారు. జనవరి 1వ తేదీ నుంచి బ్యాంక్ సేవలు వినియోగదారులకు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.